

## 'పాలాల' సందడి

సంతలో ఎడ్ల అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్న రైతులు

బెజ్జూర్, సెప్టెంబర్ 1 : పొలాల అమావాస్య పండుగ నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలోని వార సంతలో రైతుల సందడి కనిపించింది. ఎడ్లను అలంకరించడానికి రంగు రంగుల తాళ్లు, గజ్జెలు తదితర వాటిని కొనుగోలు చేశారు. అదేవిధంగా పిండి వంటలకు కావాల్సిన వస్తువులను సైతం కొన్నారు.


నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 2 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్



సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 1 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి ఆదివారం పరిశీలించారు. కంట్రోల్ రూమ్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయనిఆపరేటర్ సుబ్బారావును అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిన వెంటనే ఆయా ప్రాంతాల అధికారులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసినందున జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఏదైన సమస్య ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్‌కు 63046 86505 సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య ఉన్నారు.



కోటపల్లి : నక్కలపల్లికి వెళ్లేదారిలో ప్రవహిస్తున్న లోతొర్రె వద్ద ప్రజలకు సూచనలు ఎస్ఐ రాజేందర్



హాజీపూర్ : ఎల్లంపల్లి ప్రాజెక్టు ఏఈలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ భాస్కర్

# దంచికొట్టిన వాన

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా భారీ వర్షం**

- నిండిన ప్రాజెక్టులు.. గేట్లు ఎత్తి దిగువనకు నీటి విడుదల
- జలపాతాలకు జలకళ .. నీట మునిగిన పొలాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. ఉప్పొంగిన వాగులు, వంకలు..
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు..

మంచిర్యాల, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. శనివారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో జనం ఇండ్లు విడిచి బయటికి రాలేని పరిస్థితి నెలకొన్నది. ఆదివారం సాయంత్రానికి గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్ జిల్లాలో భీంపూర్ మండలంలోని అర్లీ(టీ)లో అత్యధికంగా 133.8 మిల్లీ మీటర్లు, ఆదిలాబాద్(అర్బన్)లో 124.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలో 128.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లో 92.3, జైనథ్‌లో 90.4, తాంసిలో 88.0, బోథ్‌లో 87.6, సిరికొండలో 87.3, సొనాలలో 84.0, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, ఉట్నూర్, తలమడుగు మండలాల్లో భారీ వర్షం పడింది. నిర్మల్ జిల్లా భైంసాలో 89.3, కుంటాలలో 79.8, భైంసాలో 75.8, నిర్మల్‌లో 73.3 మిల్లీమీటర్లు.. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో 87.8, కాగజ్‌నగర్ మండలంలోని జంబుగాలో 72.2, ఆసిఫాబాద్‌లో 71.0, లింగాపూర్, కెరిమెరిలో 68 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మంచిర్యాల జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. జైపూర్ మండలంలో 60.5 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది.

### నిండిన ప్రాజెక్టులు

మహారాష్ట్ర సహా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. దీంతో ఆదివారం ఉదయం 10 గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలారు. సాయంత్రానికి ఇన్ ఫ్లో తగ్గడంతో ఐదు గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. రెండు గేట్లను ఎత్తి అదే స్థాయిలో నీటిని కిందకు వదులుతున్నారు. స్వర్ణ ప్రాజెక్టుకు 6 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా ఇక్కడ కూడా రెండు గేట్లను ఎత్తి 12 వేల క్యూసెక్కులు కిందకు వదులుతున్నారు. కడెం గేట్లు ఎత్తడంతో పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటి ప్రవాహం పెరిగింది. ఇన్ ఫ్లో 1,29,453 క్యూసెక్కులు ఉండగా, 20 గేట్లను ఎత్తి 1,44,870 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. ఎల్లంపల్లికి ఎగువ ప్రాంతం నుంచి అధిక వరదలు వస్తున్న దృష్ట్యా డ్యామ్ మీద వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి కూడా కిందికి నీటిని వదులుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా మత్తడి వాగు ప్రాజెక్టు, సాత్నాల ప్రాజెక్టులు జలకళను సంతరించుకోవడంతో గేట్లను ఎత్తి కిందికి నీటిని వదులుతున్నారు. భారీ వర్షాలకు ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకోగా.. పలు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో పంట పొలాలు మునిగిపోయాయి. వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.



ఆసిఫాబాద్ టౌన్ : కుమ్రం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్న నీరు



కాసిపేట : చొప్పరిపల్లిలో ఇళ్లలోకి చేరిన వరద



మంచిర్యాలలో కురుస్తున్న వర్షం



ఎల్లంపల్లి ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తడంతో దిగువకు పరుగులు పెడుతున్న వరద



భీమారం : ఇళ్లలోకి వచ్చిన గొల్లవాగు బ్యాక్ వాటర్



మంచిర్యాల వద్ద నిండుగా ప్రవహిస్తున్న గోదావరి

# యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క
- పాల్గొన్న కలెక్టర్లు, సీపీ, ఎస్పీ తదితర అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మంచిర్యాలటౌన్/నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సరఫరాలో ఎక్కడా అంతరాయం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆదేశించారు. ఆదివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్ రెడ్డి, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్లు దాసరి వేణు, మోతీలాల్, 16 సర్కిళ్ల ఎస్ఈలు, 40 మంది డీఈలు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో అధికారులు అలర్ట్‌గా ఉండాలని, ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించాలన్నారు. ప్రజలు జల దిగ్బంధంలో చిక్కుకుంటే తక్షణ సహాయ చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు, కుంటలు, వాగుల వద్దకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. లోలెవెల్ వంతెనలు, కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తే రాకపోకలను నిలిపివేయాలన్నారు. నీట మునిగిన సబ్‌స్టేషన్ల వివరాలు తెలుసుకుని వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం కలిగిన చోట కలెక్టర్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పునరుద్ధరించాలని తెలిపారు. కంట్రోల్‌రూం నుంచి వచ్చే ఆదేశాలను క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు ఎప్పటికప్పుడు అమలు చేయాలని సూచించారు. అవసరమైన విద్యుత్ స్తంభాలు, వైరు, ట్రాన్స్‌ఫార్మర్లు, మిగతా మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలని, ఎలాంటి పరిస్థితులు వచ్చినా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమస్యలుంటే ప్రజలు వాటి పరిష్కారానికి విద్యుత్ శాఖ ఏర్పాటుచేసిన 1912, 18004250028 టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. సామాజిక బాధ్యతను విస్మరించి విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, కలెక్టరేట్ పాలన అధికారి రాజేశ్వర్, ఎస్ఈ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

# సీపీఎస్‌ను రద్దు చేసే వరకూ పోరాడుతాం

- ఐక్య ఉద్యోగాల సంఘం అధ్యక్షుడు శ్రీహరి
- జిల్లా కేంద్రంలో ఉద్యోగుల ర్యాలీ.. మానవహారం

హాజీపూర్, సెప్టెంబర్ 1 : కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసే వరకూ పోరాటం సాగిస్తామని జిల్లా ఐక్య వేదిక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. సెప్టెంబర్ 1న పెన్షన్ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఐక్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి ర్యాలీ తీశారు. ఐబీ చౌరస్తాకు చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది సీపీఎస్ ఉద్యోగులు మృతి చెందారని, వారి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు అందకపోవడంతో అల్లాడిపోతున్నారని, ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వాలు చూసీచూడనట్లు ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూపీఎస్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయవద్దని పేర్కొన్నారు. అంతకు ముందు మృతి చెందిన ఉద్యోగుల ఆత్మకుశాంతి చేకూరాలని నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరినేని గంగాధర్, ఎస్టీయూటీ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శంకర్ గౌడ్, టీఆర్టీఈఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ రావ్‌దేశ్ పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడ్య కృష్ణ, పీఆర్టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు బండ శాంకరి, కార్యదర్శి రాసమల్ల రవి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అసంపెల్లి రమేశ్, ప్రధాన కార్యదర్శి మోతే జయకృష్ణ, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా కార్యదర్శి సునీత, ఎంపీఈవోఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బాపురావ్, యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి వేణు, టీఎస్ జేఎఫ్‌టీ కాళేశ్వరం థర్డ్ జోన్ అధ్యక్షుడు అజాజ్, తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సుమిత్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, అన్ని యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

### ఆసిఫాబాద్ కలెక్టర్ ఎదుట ధర్నా

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 1 : పెన్షన్ ఉద్యోగులకు భిక్ష కాదని.. అది వారి హక్కు అని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఉద్యోగ–ఉపాధ్యాయ జేపీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన యూపీఎస్ విధానం కూడా సరైనది కాదని, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సోయం ఇందురావ్, హేమంత్ షిండే, ఊశన్న, ఏటుకూరి శ్రీనివాసరావు, అబ్దుల్ కమర్, తోడసం శ్రీనివాస్, తలండి లక్ష్మణ్, తుకారం, సదాశివ్, మిర్యాల్కార్ శ్రీనివాస్, నాయిని శ్రీనివాస్, అమరేందర్, సంతోష్, సునీల్, ప్రభాకర్, చంద్రయ్య, ఉపేందర్, వసీం అహ్మద్, జాదవ్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.




మంచిర్యాల జిల్లా కేంద్రంలో ర్యాలీ తీస్తున్న ఉద్యోగులు



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

# 'తాగునీటి గోస'పై కదలిక

- నాగుల్వాయిలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు
- రెండు రోజుల్లో నీరందిస్తామన్న అధికారులు

**'నమస్తే' కథనానికి స్పందన**

బెజ్జూర్, సెప్టెంబర్ 1 : మిషన్ భగీరథ నీరందక నాగుల్వాయి గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై గత నెల 27న 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో 'చెలిమెల నీరే దిక్కు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు మిషన్ భగీరథ అధికారులు స్పందిస్తూ అక్కడ ఎలాంటి సమస్య లేదని ఖండించారు. ఈ మేరకు మరోసారి గ్రామాన్ని సందర్శించిన 'నమస్తే' బృందం అక్కడి ఇబ్బందులను వివరిస్తూ గత నెల 31న 'తాగు నీటి గోస తీరేదెలా' శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో మిషన్ భగరథ డీఈ పృధ్వీరాజ్, ఏఈ అభిలాశ్, పంచాయతీరాజ్ కార్యదర్శి తుకారాం తదితర సిబ్బంది శనివారం గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు వారి ఆదేశాలతో ఆదివారం గ్రామ పంచాయతీ సిబ్బంది పలుచోట్ల పైపులైన్‌కు మరమ్మతులు చేసింది. రెండు రోజుల్లో తాగు నీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



పైపులు సరిచేసి కాంక్రీట్ వేస్తున్న సిబ్బంది



కాంక్రీట్ చేసేందుకు మట్టిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

## నేడు విద్యా సంస్థలకు సెలవు

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్ 1 : భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 2న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించామని, ప్రజావాణి కార్యక్రమాన్ని కూడా రద్దు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటికి రావద్దని సూచించారు.

## నేడు ప్రజావాణి రద్దు

నస్పూర్, సెప్టెంబరు 1 : భారీ వర్షాలు కురుస్తున్నందున సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## అంకుసాపూర్‌లో వైద్య శిబిరం

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 1: అంకుసాపూర్ గ్రామంలో శ్రీ మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ అరుణ్ బాబు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మిత్ర సేవా సమితి గౌరవ అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్ రావు, ఎస్పీఎం ప్రతినిధులు గిరిబాబు, వెంకట్ దోర, అమూల్య, ప్రసాద్, సెక్రటరీ రాజేశ్ పాల్గొన్నారు.


